## మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పరామర్శ



శ్రవణ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

నాగారం, మే 16: మండల పరిధిలోని నాగారం బంగ్లా గ్రామానికి చెందిన నమస్తే తెలంగాణ విలేకరి కన్నెబోయిన శ్రవణ్ కుమార్తె ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్ శుక్రవారం శ్రవణ్ కుటుంబాన్ని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు బిల్లా సత్తిరెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

● ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు



పల్టీకొట్టిన కారు

మునగాల, మే 16: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టడంతో ఒకరు మృతిచెందగా, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ ఖలీక్ (25), అతని స్నేహితులు మహమ్మద్ కైసర్ అలీ, అబ్దుల్లా అంజాద్, డ్రైవర్ మహమ్మద్ యాసిన్‌ఖాన్ కలిసి శుక్రవారం తెల్లవారుజామున కారులో విజయవాడకు బయలుదేరారు. కొంత దూరం వచ్చిన తర్వాత మహమ్మద్ అబ్దుల్ ఖలీక్ కారు తాన నడుపుతానని చెప్పి తీసుకున్నాడు. అతివేగంగా వచ్చిన కారు 65వ నంబర్ జాతీయ రహదారిపై మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం ఫ్లై ఓవర్ మీద అదుపుతప్పి డివైడర్‌పై ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న అబ్దుల్ ఖలీక్ తలకు తీవ్ర గాయాలు కాగా స్నేహితులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ సాయంతో క్షతగ్రాతులను కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో అబ్దుల్ ఖలీక్ మృతిచెందాడు. ఖలీక్ బాబాయి అబ్దుల్ హబీబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ వెంకటరత్నం తెలిపారు.

## 'ఇండ్ల చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి'



గరిడేపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గరిడేపల్లి, మే 16: ప్రజలందరూ తమ ఇండ్ల చుట్టూ నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని మండల వైద్యాధికారి వి.నరేశ్ సూచించారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా డ్రైడే పాటించాలని, మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ఎ.రామకృష్ణ, పీహెచ్‌ఎన్ శారద, సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, ఆశ కార్యకర్తలు సైదమ్మ, అంజమ్మ, ఉపేంద్ర, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శిఖం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



శిఖం ఆక్రమణపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన రైతులు

నేరేడుచర్ల, మే 16: మండల పరిధి పెంచికల్‌దిన్నె గ్రామంలో చెరువు శిఖం భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో పలువురు రైతులు శుక్రవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు చుట్టూ వ్యవసాయ భూములు గల రైతులు చెరువును పూడ్చి సుమారు 70 ఎకరాలు ఆక్రమించారని వెల్లడించారు. చెరువు భూమిని సర్వే చేసి పేద మత్స్యకారుల జీవన భృతి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఇంజమూరి వెంకటయ్య, సిరికొండ మట్టయ్య, లచ్చయ్య, నాగయ్య, సురేశ్, చంద్రయ్య, జానయ్య, సైదులు, రాంబాబు, హుస్సేన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## 'నకిలీ డాక్టర్లను కఠినంగా శిక్షించాలి'



ఆందోళన వ్యక్తం చేస్తున్న పూర్వ విద్యార్థి మిత్ర మండలి సభ్యులు

సూర్యాపేట టౌన్, మే 16: సూర్యాపేటలో అనుమతులు లేకుండా ఆసుపత్రులు నడిపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన నకిలీ డాక్టర్లపై దేశద్రోహం కేసులు నమోదు చేసి, వారి ఆస్తులను జప్తు చేసి కఠినంగా శిక్షించాలని సూర్యాపేట పూర్వ విద్యార్థి మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి భయ్యా మల్లికార్జున్ కోరారు. ఈ మేరకు పూర్వ విద్యార్థి మిత్రమండలి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆందోళన వ్యక్తం చేసి మాట్లాడారు. ఎన్నో ఏండ్లుగా అనుమతులు లేకుండా నకిలీ డాక్టర్లు వైద్యం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని జబ్బుతో వచ్చిన వారిని జలగల్లా పీల్చి అక్రమంగా డబ్బు సంపాదించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అంతకుముందు ఆపరేషన్ సిందూర్ అమర జవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో తన్నీరు యాదగిరి, సట్టు వెంకన్న, దేవత్ కిషన్‌నాయక్, జనార్దన్, వీరబోయిన భగవాన్, కన్నా యాదవ్, వీరబోయిన ధ్రువకాంత్, విజయ్, తపన్, మూడ్ రవీంద్రనాయక్, సంజీవనాయక్, కమలాకర్‌రావు, చిరంజీవి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాల్లో పోషకాలు మెండు

● కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుగంధి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుగంధి

గరిడేపల్లి, మే 16: చిరుధాన్యాల్లో శరీరానికి కావాల్సిన పోషకాలు మెండుగా ఉంటాయని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్.సుగంధి తెలిపారు. హుజూర్‌నగర్‌లోని మెప్మా కార్యాలయంలో కేవీకే ఆధ్వర్యంలో ఆహార ఉత్పత్తులు, పెరటి తోటల పెంపకంపై మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తులతో ఆరోగ్యంతో పాటు ఉపాధి పొందవచ్చని తెలిపారు. మహిళలు స్వయం శక్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయుష్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వేదం రామాంజిరెడ్డి, ఫారెస్ట్ ఆఫీసర్ మహేశ్, మెప్మా ఏడీఎంసీ వసంత్‌కుమార్, సీఓ సాయికృష్ణ, కనకదుర్గ, డీఈఓ సుజాత, 55 మంది సమభావన సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

● నిర్వహణపై దృష్టి సారించని అధికారులు

● నీరుగారుతున్న లక్ష్యం



నేరేడుచర్ల మండలం దిర్శించర్లలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్

నేరేడుచర్ల, మే 16: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. అయితే, వీటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయడం ద్వారా వాటిలోని రసాయనిక పదార్థాలు భూమిలోకి చేరి తద్వారా నేల, నీరు కలుషితమవుతాయి. చెత్త కుళ్లిపోయి దుర్గంధం, కాల్చడం వల్ల వెలువడిన పొగతో పర్యావరణం దెబ్బతింటుంది. దీంతో పల్లెల్లో కాలుష్యాన్ని నివారించి పర్యావరణహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం చేపట్టారు. అయితే, షెడ్లు నేడు అనేక అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నెరవేరని లక్ష్యం

ప్రతి గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్ నిర్మాణానికి రూ. 2.50 లక్షలు ఖర్చు చేశారు. ఇండ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువుగా మారే పదార్థాలను సెగ్రిగేషన్ షెడ్డులోని గుంతల్లో వేస్తారు. సేంద్రియ ఎరువుగా మారిన అనంతరం గ్రామ పంచాయతీల పరిధిలో హరితహారంలో నాటిన మొక్కలు, నర్సరీలతో పాటు రైతులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎరువును అమ్మగా వచ్చిన సొమ్మును గ్రామ పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలని భావించారు. అదేవిధంగా సేకరించిన చెత్తలోని ప్లాస్టిక్ బాటిళ్లు, గాజు సీసాలు, ఇతర వస్తువులను విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆర్థిక వనరులు చేకూరుతాయనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ పథకం కొన్ని చోట్ల అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతుంది. ప్రస్తుతం అనేక గ్రామ పంచాయతీల్లో ఈ షెడ్లను ఉపయోగించడం లేదు.

### తయారు కాని ఎరువు

ప్రతి గ్రామ పంచాయతీకి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక ట్రాక్టర్‌తో పాటు వాటర్ ట్యాంకర్‌ను కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించేందుకు ఇంటింటికి బుట్టలు పంపిణీ చేశారు. కానీ చాలా మంది తడి, పొడి చెత్తను వేరు చేయకుండా పంచాయతీ సిబ్బందికి ఇష్టానుసారంగా అందజేస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది వాటిని చెత్తను వేరు చేసి షెడ్లలో వేసి ఎరువు తయారు చేయాలి. ఇలా తయారైన ఎరువులను గ్రామ పంచాయతీ విక్రయించి అదనపు ఆదాయాన్ని పెంచుకోవాలన్నదే వీటి ఉద్దేశం. కానీ చాలా గ్రామాల్లో ఎరువు తయారు చేస్తున్న దాఖలాలు కనపడటం లేదు.

## రైతులు అధైర్య పడొద్దు

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ఆత్మకూర్.ఎస్, మే 16: రైతులు అధైర్యపడొద్దని, ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పష్టం చేశారు. మండల పరిధి ఏనుబాములలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల దృష్ట్యా ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో గత రబీ సీజన్ కంటే ఈసారి ధాన్యం దిగుబడి బాగా వచ్చిందని కలెక్టర్ చెప్పారు. అనంతరం చివ్వెంల మండలం బీబీగూడెంలోని శ్రీ శివదుర్గ రైస్ ఇండస్ట్రీస్‌లో జరుగుతున్న ధాన్యం దిగుమతులను కలెక్టర్ పరిశీలించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా హమాలీల సంఖ్యను పెంచుకొని దిగుమతులు త్వరగా అయ్యేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, సివిల్ సప్లై డీఎం ప్రసాద్, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు గేదె మృత్యువాత

ఆత్మకూర్.ఎస్, మే 16: మండలంలో గురువారం రాత్రి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. రెండుచోట్ల పిడుగు పడింది. పిడుగుపాటుకు ముక్కుడుదేవులపల్లి గ్రామంలో బయ్య సోమయ్యకు చెందిన గేదె మృత్యువాత పడింది. అదేవిధంగా రామన్నగూడెంలో తాటిచెట్టుపై పిడుగుపడి చెట్టు దగ్ధమైంది. కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడి కాంటాలు కాకపోవడంతో ధాన్యం తడిసిపోయి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 'దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి'

మేళ్లచెర్వు, మే 16: దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరుగనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగిన వేతనం చెల్లించాలని తదితర డిమాండ్లతో చేపట్టనున్న సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

సూర్యాపేట రూరల్, మే 16: సూర్యాపేట పట్టణ పరిధిలోని జనగాం క్రాస్‌రోడ్డులో గల వెంకటేశ్వర టౌన్‌షిప్ సమీపంలో ఓ వ్యక్తి వడదెబ్బతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణానికి చెందిన కంచర్ల రాజు సద్దల చెరువు సమీపంలోని అనాథ ఆశ్రమంలో ఉంటున్నాడు. గురువారం జనగాం క్రాస్‌రోడ్డులోని ఓ పాత ఇనుము షాపులో పనికి వెళ్లాడు. వచ్చిన డబ్బులతో మద్యం తాగి వెంకటేశ్వర కాలనీకి వెళ్లే రోడ్డు పక్కన చెట్ల కింద పడుకున్నాడు. ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురై చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. రాజుతో పాటు పనిచేసే గొట్టిపల్లి నాగరాజు అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ బాలునాయక్ తెలిపారు.

## ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి

● టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలి

● అదనపు కలెక్టర్ రాంబాబు



బాలెంలలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట రూరల్, మే 16: కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ పి.రాంబాబు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. అకాల వర్షాలకు వడ్లు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. మండల పరిధిలోని రాయినిగూడెం, బాలెంల, ఎర్కారం, పిల్లలమర్రి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సుమారుగా 90 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ధాన్యాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. లారీలను సర్దుబాటు చేసి కొనుగోలు కేంద్రాలకు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, కేంద్రాల ఇన్‌చార్జిలు ఫణిమా, పుష్పలత, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### త్వరితగతిన దిగుమతి చేసుకోవాలి

తిరుమలగిరి: రైస్ మిల్లుల్లో ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. మండల కేంద్రంలోని ఏఎస్‌ఆర్ రైస్ మిల్లును శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తాసీల్దార్ హరిప్రసాద్, ఏఓ నాగేశ్వరరావు, ఏపీఎం మధుసూదన్, ఆర్‌ఐ జార్జిరెడ్డి, ఏఈఓ లక్ష్మీచైతన్య పాల్గొన్నారు.

## 'పిల్లలను మోడల్ స్కూల్‌లో చేర్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రబాబు

నాగారం, మే 16: బడిబాట కార్యక్రమంలో భాగంగా నాగారం మండలంలోని పసునూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం శుక్రవారం పసునూరు గ్రామంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బల్గూరి చంద్రబాబు మాట్లాడుతూ పసునూరు మోడల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారని తెలిపారు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్న తల్లిదండ్రులు వారిని పసునూరు మోడల్ స్కూల్‌కు పంపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు అందజేస్తున్నట్లు వివరించారు. విశాలమైన ఆటస్థలం ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలను మోడల్ స్కూల్‌లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సూర్యకాంతం, సంపత్, ఉపాధ్యాయులు వేముల బాలరాజు, సోమసుందర్, నాగరాజు, అశోక్, మహేశ్ పాల్గొన్నారు.

## డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్‌ఓ కోటాచలం



అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌ఓ కోటాచలం, వైద్య సిబ్బంది

సూర్యాపేట టౌన్, మే 16: రాబోయే వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తం చేయాలని డీఎంహెచ్‌ఓ కోటాచలం వైద్య సిబ్బందికి సూచించారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డెంగ్యూ కారక దోమ నిల్వ నీటిలో వృద్ధి చెందుతుందని తెలిపారు. కాబట్టి ప్రజలు తమ ఇండ్లలోని పాత టైర్లు, పూలకుండీల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. దోమల ద్వారా డెంగ్యూ, చికున్‌గున్యాతో పాటు మలేరియా, బోధకాలు, మెదడువాపు వ్యాధులు సంభవిస్తున్నాయని అన్నారు. అనంతరం జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాజియా మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నమోదైన ప్రాంతాల్లో మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో రసాయనాలు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది ప్రతిరోజు వారి ప్రాంతాల్లో జ్వరం కేసులపై సర్వే చేయాలని సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడేలో పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జయమనోహరి, డాక్టర్ అశ్రిత, ఏఎంఓ మోతీలాల్, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరాజు, సూపర్‌వైజర్ వెంకన్న, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత శుభ్రత అవసరం : మండల వైద్యాధికారి లిఖిత

నూతనకల్, మే 16: జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా మండల వైద్య సిబ్బంది శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి లిఖిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటించడంతో పాటు ఇండ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ర్యాలీలో సీహెచ్‌ఓ చరణ్‌నాయక్, పీహెచ్‌ఎన్ తారమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బహుజనుల విప్లవ కెరటం మారోజు వీరన్న

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



తుంగతుర్తి: మారోజు వీరన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేలు

తుంగతుర్తి, మే 16: బహుజనుల విప్లవ కెరటం మారోజు వీరన్న అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మారోజు వీరన్న వర్ధంతి సందర్భంగా శుక్రవారం కర్విరాల గ్రామంలోని వీరన్న విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అదేవిధంగా మారోజు వీరన్న కుమార్తె మారోజు దిశ కర్విరాల గ్రామంలోని వీరన్న స్థూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు.

తిరుమలగిరి: మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో మారోజు వీరన్న వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక తెలంగాణ మహాసభ కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: పీడిత జన సామాజిక విప్లవకారుడు, కుల, వర్గ జమిలి పోరాటాల నిర్మాత మారోజు వీరన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ (ఆర్‌ఎం) రాష్ట్ర కార్యదర్శి చామకూరి నర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో గల భీంరెడ్డి నర్సింహారెడ్డి విగ్రహం వద్ద మారోజు వీరన్న స్మారక కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వీరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ వర్గం అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న, జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు పాల్గొన్నారు.

## 'మిల్లుల్లో ధాన్యం దిగుమతులను వేగవంతం చేయాలి'

నూతనకల్, మే 16: రైస్ మిల్లుల్లో ధాన్యం దిగుమతులను వేగవంతం చేయాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. మండల కేంద్రం నూతనకల్‌లోని ధాన్యం కొగుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ కాంటాలు త్వరితగతిన పూర్తి చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ హస్సాన్, రైతులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి

● మండల వైద్యాధికారి వేణుగోపాల్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి వేణుగోపాల్

హుజూర్‌నగర్ రూరల్, మే 16: ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇండ్ల చుట్టూ మురుగు నిల్వలు లేకుండా చూసుకోవాలని మండల వైద్యాధికారి వేణుగోపాల్ సూచించారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని గోవిందాపురంలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు కుట్టకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కేబుల్ వైర్ల దొంగ అరెస్ట్

నేరేడుచర్ల, మే 16: పొలాల వద్ద విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లను దొంగిలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రవీందర్ శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన పస్తం అశోక్ అలియాస్ అనిల్‌కుమార్ నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రామాపురంలో ఈ నెల 13న రాత్రి 10 వ్యవసాయ మోటార్ల నుంచి సుమారు రూ.20 వేల విలువైన కేబుల్ వైర్లను దొంగిలించాడు. ఈ నెల 15న కేబుల్ వైర్లను విక్రయించడానికి మోటార్ సైకిల్‌పై మిర్యాలగూడ బయలుదేరాడు. మండలంలోని చిల్లేపల్లి వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్‌ఐ వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన అశోక్‌ను ఆపి పరిశీలించగా కేబుల్ వైర్లు కనిపించాయి. కేబుల్ వైర్లు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని అశోక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రవీందర్ వెల్లడించారు.

## అకాల వర్షానికి తడిసిన ధాన్యం



తిరుమలగిరిలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు

తిరుమలగిరి, మే 16: మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులకు తీరా అమ్ముకుందామంటే తిప్పలు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా సమయానికి కొనుగోళ్లు జరుగక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. అకాల వర్షాలకు నెల రోజుల వ్యవధిలోనే ధాన్యం మూడుసార్లు తడిసి నాణ్యత కోల్పోయి ధర రాక నానా తంటాలు పడుతున్నా అధికారులకు, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుల బడిబాట



బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు

పెన్‌పహాడ్, మే 16: మండల పరిధిలోని అనంతారం గ్రామంలో జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి, సంఘబంధం అధ్యక్షురాలు షేక్ అలీమా, ఉపాధ్యక్షురాలు జె.ప్రవళిక, అంగన్‌వాడీ టీచర్ జానిబేగం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడ రూరల్, మే 16: కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం, చిమిర్యాల, కాపుగల్లు గ్రామాల్లో శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి సైదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున విద్యుత్ అంతరాయం కలుగుతుందని వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు అధికారులను సహకరించాలని ఆయన కోరారు.

### గరిడేపల్లి మండలంలో..

గరిడేపల్లి: గరిడేపల్లి మండలంలోని పొనుగోడు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకటన

ఇందుమూలముగా నా యొక్క క్లయింటు అయిన గంగవరపు లక్ష్మణరావు, తండ్రి మురళీధరరావు, నివాసం రెడ్లకుంట గ్రామం, కోదాడ మం॥ సూర్యాపేట జిల్లా గారి నుండి సంజాయిషీ పొంది సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా.

నా క్లయింటు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తి విక్రయ రిజిస్ట్రార్ విక్రయ దస్తావేజు నెం.8557/2018 ద్వారా శెట్టి జ్యోతి, భర్త సతీష్ మరియు మొక్క రామకృష్ణ. తండ్రి సాంబయ్య గార్ల నుండి కొనుగోలు చేసి ఆనాటి నుండి తమ సంపూర్ణ స్వాధీన యాజమాన్య హక్కు కలిగి యున్నారు. ఇట్టి ఒరిజినల్ దస్తావేజు నెంబరు 8557/2018 దస్తావేజుకు మూలాధారమైన ఒరిజినల్ లింకు దస్తావేజు నెంబర్లు:7978/2017 అయి వున్నది. మరియు ఇట్టి దస్తావేజులకు లింకు దస్తావేజులైన 7879/2015, 139/2015, 3062/2013, 3320/2010 అయి వున్నది. ఇట్టి లింకు డాక్యుమెంట్సు 7879/2015, 139/2015, 3062/2013, 3320/2010లు కోదాడలో జిరాక్సు తీసుకునే సమయంలో పోయినవి. ఇట్టి ఒరిజినల్ డాక్యుమెంట్ కొరకు ఎంత వెతికినను లభించలేదు. ఇట్టి దస్తావేజు నా క్లయింటు అయిన గంగవరపు లక్ష్మణరావు గారు ఏదైనా బ్యాంకులకుగాని, ఆర్థిక సంస్థలకు గాని, వ్యక్తులకు గానీ, లీజు గానీ ఏ విధమైన తాకట్టు గాని, కుదువ పెట్టడం గాని చేసియుండలేదు. ఇట్టి ఆస్తిని తనఖాయుంచి నా క్లయింటు ప్రభుత్వ లేదా ప్రయివేటు ఏ విధమైన హక్కులు సంక్రమించియున్న పక్షములో ఈ క్రింద తెలిపిన చిరునామాకి సంబంధిత ఆధార పత్రాలతో వారి యొక్క హక్కులు ఈ ప్రకటన వెలువడిన తేది నుండి ఒక వారం (7) రోజులలో తెలుపుకొనగలరు. దరిమిలా వచ్చిన ఆక్షేపణలు నా యొక్క క్లయింట్‌ను ఏ విధముగా కూడా బాధ్యులను చేయజాలవు. అభ్యంతరములు తెలియజేయవలసిన చిరునామా.

**షెడ్యూలు ఆస్థి:**
నల్లగొండ జిల్లా రిజిస్ట్రార్ గారి అజ్మాయిషికి లోనై యుండి సూర్యాపేట జిల్లా కోదాడ మండలం, కోదాడ టౌన్ మున్సిపాలిటీ లిమిట్స్‌లో బ్లాక్ నెం.4, సర్వే నెం.509/3 మరియు 511/3 మిం.లే. చ.గ.160.2లు, సర్వే నెం.509 మరియు 511 మిం.లే. 218.8 చ.గ.లు ఈ విధంగా ఉండి ఏకప్రదేశంగా యున్న మొత్తం ఖాళీ స్థల విక్రయ విస్తీర్ణం 379 చ.గ.లకు సరియైన 316.844 చదరపు మీటర్లకు హద్దులు: సదరు ఆస్థి పెండ్యాల పిచ్చయ్య గారి ఇంటి లైనులో గలదు.
**ఉత్తరం:** కొక్కు రామకృష్ణ గారి స్థలం, **దక్షిణం:** 24 అ॥ల మునిసిపాలిటి రోడ్డు, **తూర్పు:** ముర్రు జ్యోతి గారి స్థలం, **పడమర:** కొక్కు త్రివేణి గారి స్థలం.

సం/- **నాగుబండి కృష్ణమూర్తి,** అడ్వకేట్
ఇంటి నం.3-199/1/సి, పబ్లిక్ క్లబ్ ఎదురుగా, నయానగర్, కోదాడ-508206. సూర్యాపేట జిల్లా, సెల్ నెం.9848256389